


పాఠకుల జ్ఞా పకాల పేటిక

# పేరవరం

-డా. జొన్నలగడ్డ మార్కండేయులు



అడవి, ఉసిరి, సముద్రపుటుప్పు, కలిపిన భగవంతుని సృష్టి విచిత్రం, కంప్యూటర్ యుగంలో, మరిన్ని విచిత్రాలు సాధించింది. కాశి వెళ్ళాలంటే, భయపడిన తెలుగు ప్రజలు ఇప్పుడు ప్రపంచము నలుమూలల లోను తమ ఉనికిని చాటుకున్నారు. ఇవాళ ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి పల్లె నుంచి కుటుంబములో కనీసము ఒక వ్యక్తైన అమెరికాలో ఉంటున్నారంటే అతిశయోక్తి కాదు. పుట్టిన ఊరు జ్ఞాపకానికి రావడం సహజమే అయినా, ఆ అనుభూతిని అమెరికా నుంచి అందుకున్నా, అమెరికాకు అందించినా, సుజన రంజనమే అవుతుంది. మరి మా ఊరంటే నా ఇష్టాన్ని ఎంత మందికి పంచగలనో ఒక మారుమూల గ్రామంనుంచి ప్రయత్నిస్తాను.

తూర్పు గోదావరి జిల్లాలోని కోనసీమ గురించి తెలియని వారుండరు. ఇది దండకారణ్యప్రాంతమని, శ్రీరామచంద్రుడు, సీతాదేవితో కలసి ఇక్కడే వనవాసము చేసాడని కల్పిత గాథలని కొట్టిపారేయకుంటే ఆసక్తికరమైన కథనాలు కోకొల్లలు. కోనసీమ అమలాపురము, రాజోలు పార్లమెంటు నియోజక వర్గాలుగ విభజింపబడి ఉంది. ఆ అమలాపురానికి చెందిన కొత్తపేట అసెంబ్లీ నియోజక వర్గానికి చెందిన ఆత్రేయపుర మండలములో, "రావులపాలెం బొబ్బర్లంక" బస్సు రూటులో మా ఊరు ఉంది. మా ఊరి పేరు పేరవరం.

అమలాపురం పాంచాల దేశమని, ద్రౌపది పుట్టిల్లని, మహాభారత కథలుంటే మా ఆత్రేయమండలం మాత్రం రామగాథను ప్రచారంలోకి తెచ్చింది. మండల కేంద్రమైన ఆత్రేయపురంలో ఒక రావి చెట్టుంది. ఆ చెట్టు క్రింద సీతారాములు కూర్చున్నారని ఇక్కడి ప్రజల విశ్వాసము. సీతాపహరణ ఘట్టంలో రావణునితో వీరోచితముగా పోరాడిన జటాయువు మా పేరవర గ్రామ ప్రాంతంలో అసువులు బాసాడట. ఇలా ఎన్నో కథలున్నాయి. మా పేరవరం గురించి చెప్పే ముందు ఆత్రేయపుర మండలం గురించి కూడా చెప్పాలి.

అత్రి మహర్షి తపస్సు చేసిన చోటు గనక ఆత్రేయపురంగా పిలువబడుతోంది. పదహారు గ్రామాలు ఈ

మండలములో ఉన్నాయి. ఈ మండలంలోని ప్రతి గ్రామం ఏదో ఒక విశేషం కలిగి ఉంటుంది. ఒకే శిలపై కేశవ, జగన్మోహిని రూపాలతో, పాదాల నుంచి గంగ స్రవింప చేస్తు, పూజలందుకుంటు-- ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ర్యాలి గ్రామ దేవాలయం ఈ మండలంలోనే ఉంది. రక్తచందనం కలపలో మనోహరాకృతితో వెలసిన అరుదైన వేంకటేశ్వర స్వామిని కలిగిన వాడపల్లి అనే గ్రామము, ఆ స్వామి రథోత్సవ సమయంలో, స్వాతంత్ర్యసంగ్రామ దినాలలో, గాంధీగారి అనుచరులు రథముపై జాతీయ జెండా ఎగుర వేసి అసువులు బాసినందుకు చరిత్ర పుటలకెక్కి ఆత్రేయపుర మండలానికి ఖ్యాతిని తెచ్చింది. పూతరేకులు, మామిడితాండ్ర అన్నా మా మండలం గుర్తుకు వస్తుంది. ఇలా ప్రతి గ్రామం గురించి చెపితే ఓ గ్రంథం తయారవుతుంది. విషయం మా ఊరు కాబట్టి ఈ మండలంలోనిదే అయిన మా పేరవరం గూర్చి చెప్పుకుందాం.

మా ఊరు రాజమండ్రి రైల్వే స్టేషన్ నుండి 15 కి.మీ దూరంలో ఉంది. ధవళేశ్వరం బ్యారేజి మీదుగా, బొబ్బర్లంక, రావులపాలెం రహదారిలో బొబ్బర్లంక తరువాత రెండవ గ్రామంగా ఉంది. రహదారికి ఒకవైపు పచ్చని పంటపొలాలు, మరో వైపు కాటన్ దొర తవ్వించిన కాలువ- గోదావరి జలాల్ని తీసుకుని కోనసీమ గ్రామలను సస్యశ్యామలం చేస్తూ పెడుతున్న పరుగు ఏదో తెలియని ఆనందం కలిగించక మానదు. కాలువకి ఆవలివైపు రాజవరం అనే గ్రామం ఉంది. ఈరెండు గ్రామాలను కలుపుతూ వంతెన ఉంది. ఈ వంతెన లేని రోజులలో బల్ల కట్టు మీద అటునుంచి ఇటు, ఇటునుంచి అటు దాటడంలోని మజా, కాలువ స్నానం చేస్తూ ఈతలు కొడుతూ మధ్యలో బల్లకట్టు మీంచి దూకడం చిన్ననాటి ముచ్చటగ మారిపోయినా జ్ఞాపకం వస్తూనే ఉంటుంది. లాంచీలు, రహదారిపడవలు మీద మేము ప్రయాణం చేసేవాళ్ళమంటే ఇప్పటి వాళ్ళకు నమ్మబుద్ధికాదు.


రెండు గ్రామాలని కలుపుతున్న వంతెన

ఏ సౌకర్యాలు లేని రోజులు ఇప్పుడు తలచుకుంటే మేమెలా జీవించామా అని ఆశ్చర్యం కలుగుతుంది. అప్పుడైనా, ఇప్పుడైనా, మా గ్రామం నుంచి నిత్యావసర వస్తువులకు దేనికైనా మేము రాజమండ్రి వెళ్ళాల్సిందే అయితే రాజమండ్రి కూడ పాలు, పెరుగు, వెన్న వంటి గ్రామీణ ఉత్పత్తులకు మారాకకోసం ఎదురు చూస్తూంటుంది. ఇప్పుడు బ్యారేజి సౌకర్యం ఏర్పడింది. ప్రయాణ సౌకర్యాలు పెరిగాయి. కాని కాటన్ బ్యారేజి లేని ఆ రోజులలో, లాంచీలు, నావలు, దాటిప్రయాణించే వాళ్ళం. మాతోబాటే పాల కావిళ్ళు, బిందెలు, సైకిళ్ళు కూడా. మేమనే ఏమిటి? గోదారి మీద ఆలమూరు, సిద్ధాంతంవంతెన నిర్మాణం జరిగి జాతీయ రహదారి ఏర్పడే వరకు, కోనసీమలోని ఆబాల గోపాలము, రావులపాలెం మీదుగ బస్సు ప్రయాణం చేసి బొబ్బర్లంక చేరుకుని లాంచీ మీద గోదావరి ప్రయాణం చేసి రాజమండ్రి వెళ్ళాల్సి వచ్చేది. లాంచి దాటిపోతే నావమీద గోదావరి దాటి ధవళేశ్వరం చేరుకుని సిటీబస్సు ఎక్కి రాజమండ్రి వెళ్ళేవారు. మా పాట్లు మరీను.

బొబ్బర్లంక మా పేరవరం గ్రామానికి శివారు గ్రామం. అప్పట్లో బొబ్బర్లంక కూడా మా గ్రామ

పంచాయితీలోనే ఉండేది. మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న ఈ గ్రామంలో చేరుకుని, లాంచీ ఎక్కి రాజమండ్రివెళ్ళే వాళ్ళం. లాంచీ దాటిపోతే రాజమండ్రి వెళ్ళడానికి మేముపడిన అవస్థలు, మాకు గుర్తుకొచ్చినపుడల్లా, ఈ నాటి సౌకర్యాలు చూస్తుంటే కలా, నిజమా అనిపిస్తుంది. సాధారణంగా బొబ్బర్లంకకు నడిచే వెళ్ళేవారం. లేదంటే ముందు చెప్పు కుంటే రిక్షా ఉండేది. ఆనకట్టలు దాటడం నిజంగా ఒక పెద్ద వ్యాయమమే. రెండు ఆనకట్టలకు మధ్య పిచికల లంక అనే నేల ప్రదేశం ఒక కిలోమీటరు ఉండేది. లంకలో కోతులుండేవి. ఎవర్నీ అవి ఏమీ చేయకపోయినా, ఆప్రదేశం దాటే వరకు భయంగా ఉండేది. ఆనకట్టల మీద జాగ్రత్తగ నడచేవాళ్ళం. కారు కాని, లారీకాని ముందు నుంచి వచ్చినా, వెనక నుంచి వచ్చినా, తలపుల దగ్గర నిలబడేవాళ్ళం. వేసవి కాలంలో ఏ కొద్ది రోజులో తప్ప మిగిలిన అన్ని రోజులలో నీరు పారుతుండడంవల్ల నాచుకట్టి ఉండేది. ఎంత జాగ్రత్తగా నడచిన నేను ఒక్కసారి కూడా జారలేదని గర్వంగా చెప్పగల ఆనకట్టమీద నడచిన ఒక్క వ్యక్తిని ఇంతవరకు నేను చూడలేదు. ఇప్పుడు ఆనకట్టలేదు. బ్యారేజి మీదనుంచి ప్రభుత్వ, సిటీ బస్సులతో బాటు, అన్నిరకాల వాహనాలు, అందు బాటులో ఉన్నాయి, ఆనకట్ట ఎలా ఉండేదో నమూనాగ కాటన్ మ్యూజియంలో (ధవళేశ్వరంలో ఉంది) చూడొచ్చు. లాంచీలు, నావలు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు, మా జీవితాలలో పెనవేసుకుపోయిన ఈ నావలు, లాంచీలు సిటీ పార్కులలో బోటు షికారు పేరుతో మిగిలి మాకు మాత్రం తీపి జ్ఞాపకాలు జ్ఞప్తికి తెస్తుంటాయి.



నమూనాగా ఉన్న బ్రిడ్జి

ఇక మా ఊరు, పూర్తిగా వ్యవసాయానికే పెద్దపీట వేస్తుంది. పచ్చని వరిచేలు, చెరకు, అరటి, కంద,ఒకటేమిటి అన్ని రకాల పంటలు కనువిందు చేస్తుంటే పొలాలలో తిరగొచ్చు. మాగ్రామ లంక పొగాకు పేరు గాంచింది. ఇప్పుడు కూడ మేము సిటీలనుంచి ఎవరైన వస్తే గోదావరి మధ్యలో ద్వీపకల్పాలుగా కనిపించే ఈ లంకలలోకి నావ మీద ప్రయాణం చేయించి సరదాగ చూస్తుంటాము. సినిమాలలోను, జానపద గీతాలలో కనిపించే మొక్కజొన్న తోటలు ఈ లంకలలో బాగా చూడొచ్చు. పుచ్చ కాయలు, దోసకాయలు మొదలైన పాదులు, కనువిందేకాదు, నోటికి కూడా విందు చేస్తాయి. ఇప్పుడిప్పుడే లంకలలో కూడా అన్ని రకాల పంటలూ వేస్తున్నారు. అయినా, జామచెట్లంటే మాత్రం చేతికందే దోరజామకాయ అందుకుని తిన్న మజా లంకలోనే కలిగిన అనుభూతి ఎవరికి వారే పంచుకోవాలి గాని, చెపితే కలిగేది కాదు.



మా ఊరి ఏటి గట్టు

ఇక వర్షాకాలంలో గోదావరికి వరద వస్తుంది. గోదావరి ఊళ్ళోకి రాకుండా ఎత్తుగ ఉండే గట్టు నిర్మాణాన్ని ఏటిగట్టు అంటారు. ఈ ఏటిగట్టు మీద నిలబడి పరవళ్ళు

త్రొక్కే గోదావరి అందచందాలు వరద సమయంలో చూసి తీరాల్సిందే. గట్టుకి గండి పడి వరదనీరు ఊరిలోకి ప్రవేశించకుండ వంతులు వేసుకొని కాపలా కాస్తారు. రెవెన్యూ అధికారులతోను,సందర్శకులతోను గట్టు కిటకిటలాడి పోతుంది.

వరద సమయంలో గోదావరిలో పెద్ద పెద్ద దుంగలు, వంటచెరకు కొట్టుకు వస్తాయి. అవి సేకరించడంకోసం కొంతమంది వడిని కూడా లెక్క చేయకుండా తెప్పలు వేసుకుని ఈదుతూ ఒక్కొక్కప్పుడు, ప్రవాహంలో సుదూర ప్రదేశానికి కొట్టుకు పోయే వారు. క్షేమంగా తిరిగొచ్చినా ఇంట్లో వాళ్ళకు ప్రతి ఏటా ఈ ఆందోళన తప్పదు. మా ఊళ్ళో వేణు గోపాలస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయానికి లోపల ఒక ధ్వజ స్థంభమూ, బయట ఒక ధ్వజస్థంభమూ ఉన్నాయి. నూట యాభై ఏళ్ళ క్రితం ఒక రైతు కలపకోసం ఇలాగే గోదావరిలో ఈతకు వెళ్ళి నపుడు, ప్రవాహంలో కొట్టుకుపోయి రెండురాత్రులు భయంతోనే గోదావరిలో గడిపి క్షేమంగా చేర్చమని వేణుగోపాలునికి మ్రొక్కుకున్నాడట. అప్పుడు చీకట్లో ఒక దుంగ ఆధారంగ దొరికితే అందుకుని ప్రవాహానికి ఎదురీదుకుంటూ ఒడ్డుకు చేరి చూసేసరికి అది మా ఊరే అయిందట.ఆ దుంగ సరిగ్గా ధ్వజ స్తంభానికి తగిన పొడవులో ఉండడం వలన అది స్వామి మహిమేనని భావించి, తనను క్షేమంగా చేర్చిన ఆ దుంగను స్వామికి అంకితంగా ఆ రైతు ఆలయం బయట ధ్వజస్తంభంగ ప్రతిష్ఠింప చేశాడు. రెండు ధ్వజస్తంభాల గుడిగా పేరవరం గ్రామ క్షేత్రపాలకుడైన మా వేణుగోపాలుని గుడి చూడదగ్గదని మీకనిపిస్తే నాకెంతో సంతోషం కలిగిస్తుంది. మరి మా శివాలయం కూడా స్థల పురాణం కలిగి ఉంది. రావణ సంహారం తరువాత. ఆ మహాభక్తుని సంహరించినందుకు దోష నివారణార్థం రాముడు కోనసీమలో ఎన్నోశివలింగాలు ప్రతిష్ఠించాడు. అందుచేత, మాగ్రామ నిర్మాణ సమయంలో దొరకిన ఈ శివలింగానికి రామలింగేశ్వరుడని పేరు పెట్టి గుడి కట్టారు. అమ్మవారికి మొదట్లో పార్వతి అని పేరు, అయితే గర్భగుడిలో శివలింగం ప్రక్కనే పార్వతి పేరుతో ఉన్నప్పుడు నిర్మాణంలో ఉన్న, పేరవరం గ్రామం తరచూ గృహ దహనాలకు గురైందంట. అందుచేత ఉమ పేరుతో శివలింగం ప్రక్కనుంచి పార్వతీదేవిని తొలగించారంట. గర్భగుడికి బయట ప్రవేశ ద్వారంలో ఎడమ వైపు ఒక గూటిలో వినాయకుడిని ప్రతిష్ఠించాక, కుడి వైపు గూటిలో ఉమ పేరుతో అమ్మవారిని ప్రతిష్ఠించాక, ఉమా, రామలింగేశ్వరుడి పేరుతో మా గుడి బహు పురాతనమై ఊరు పుట్టినప్పటినుంచి ఉంది. ఇంకా వేంకటేశ్వరుడు, రాముడు, నాంచారమ్మ, నాగారమ్మ అనే గ్రామ దేవతల గురించి ఎన్నెన్నో కథనాలు.


రైతు ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

గ్రామ నిర్మాణంలో దొరికిన శివలింగం


ఈ నవీన నాగరికతలో కూడా పల్లె జీవనాన్ని, సజీవ చిత్రంగ చూపించగల మా ఊరు గురించి ఎక్కడ ఆపాలో తెలియక ప్రస్తుతానికి సెలవు తీసుకుంటున్నాను.

మార్కండేయులుగారు ఆత్రేయపురమండలం లోని పేరవరానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆత్రేయపురంలో మహాత్మాగాంధీ జూనియర్ కళాశాలలో లెక్చరర్ గా పనిచేస్తున్నారు. హిస్టరి, ఎకనామిక్స్, పోలిటిక్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసి తెలుగులో ఎం.ఎ, ఎం.ఫిల్, పి.హెచ్.డి చేశారు. "తెలుగుసాహిత్యంలో ధనుశ్శాస్త్రము" అనే సిద్ధాంత గ్రంధాన్ని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ముద్రించింది. "అపూర్వ గాథలు" అనే పురాణ కథల సంకలనం ఈయన రెండో ప్రచురణ."పులగుర్త రామారావు రచనలు-- ఒక పరిశీలన" అనేది ఈయన అముద్రిత రచన. ఇవే కాకుండా చందమామ వంటి పిల్లల పత్రికలతో సహా అన్ని ప్రముఖ వార, మాస, దిన పత్రికలలో కథలు వ్యాసాలు రాశారు.

పుట్టి పెరిగిన వూరు కన్న తల్లితో సమానం అంటారు. ప్రపంచంలో ఏ మూల వున్నా మన అమ్మని ఎలా మరచి పోలేమో, సొంత ఊరుని కూడా అలానే మరచిపోలేము. దూరం ఎక్కువయ్యే కొద్దీ అనుబంధం మరింత పెరిగినట్లు మన వూరుకి దూరంగా నివసిస్తున్న కొద్దీ మరింత గుర్తొస్తుంటుంది. మీ వూరంటే మీకెందుకంత ఇష్టమో తోటి పాఠకులతో పంచుకోండి. మీ వూళ్ళో చిన్నప్పుడు మీరు చేసిన చిలిపి పనులూ, అప్పటి నేస్తాలూ, ఆడుకున్న ఆటలూ, ఆటల్లో తగాదాలూ, పందాలూ, పండుగ రోజులూ, హైస్కూల్లో అల్లరి సంఘటనలూ..ఏమైనా వ్రాయండి. అప్పటి ఫోటోలు కూడా పంపిస్తే మీ వ్యాసం మరింత అందంగా వుంటుంది..ఈ విశాల ప్రపంచంలో ఇంకెక్కడో ఉన్న మీ వూరి నేస్తాలు మిమ్మల్ని మళ్ళీ పలకరిస్తారేమో చూడండి! మీవూరి జ్ఞాపకాలతో బాటు ప్రస్తుతం మీరేం చేస్తున్నారో, ఎక్కడున్నారో కూడా వ్రాయడం మరువకండి... !!